




రామశర్మ మొహం వేలాడేసుకుని గేటు దాటి వీథిలోకి వచ్చాడు. ఆయన వెనకే గేటుదాకా వచ్చిన అన్నపూర్ణమ్మ-

"అన్నయ్యా, నువ్వు అనవసరంగా బాధపడకు! నే నెలాగో ఒకలాగ ఆ సంగతి కనుక్కుని ఈ వ్యవహారం తేల్చేస్తాను" అంది ఓదారుస్తూ। ఇంటి వరండాలో నిల్చుని ఉన్న మా మా (మారుపేర్ల మారుతీరావు) మీసాలు (లేకపోయినా) మెలేస్తూ-

"ఏమిటే ఆ గునగునలు? నువ్వు ఉరెట్టుకు చచ్చినా నా నించి ఆ రహస్యం రాబట్టలేవు" అంటూ గర్జించాడు. అన్నపూర్ణమ్మ ఆ గర్జనకి ఏమాత్రం చలించకుండా-

"మీ నించి రహస్యం రాబట్టడానికి నే నేం ఉరెట్టుకో నఖ్ఖర్లేదు. ఆ సంగతి మీకూ తెలును గాని, మా అన్నయ్యకి ఇలాంటి పరీక్ష పెట్టడం బాగులేదు" అంది రుసరుసలాడుతూ. మా మా విలన్‌లాగా నవ్వాడు. మా మా మామూలుగా నవ్వితేనే సినిమాలో విలన్ నవ్వులా ఉంటుంది. ఇప్పుడు భార్య, బావమరదుల అవస్థ చూసి నిజంగానే విలన్‌లా నవ్వాడు. రామశర్మ బేలగా బావగారి వైపు చూస్తూ-

"నీ వ్యవహారం అంతు పట్టడం లేదోయ్, బావా! రోజు రోజుకీ మరీ చిన్న పిల్లాడి లాగా తయారవుతున్నావు. నీ పంతానికి పిల్లల జీవితాలని బలి పెడతావా? కావాలంటే మరో పది వేలు మామగారి లాంఛనాల కింద ఇచ్చుకుంటాను" అన్నాడు. మా మా మరింత నవ్వి-

"నే నడిగిన ప్రశ్నకి జవాబు గనక తెలును కుంటే నేనే కోడలికి పది వేలు ఎదురిస్తాను. లేకపోతే మరి మన సంబంధం సంగతి మరిచిపో!

జి. ఉషావిఠల్

వెళ్ళు! వెళ్ళి ఆ బట్ట తలకి కాస్త వదును పెట్టు!" అంటూ లోపలికి చక్కా పోయాడు. రామశర్మ-

"తల తిక్కశంకరయ్య నీ కెక్కడ దొరికాడమ్మా! సరే, వస్తాను. రేపట్లోపల విషయం తెలిస్తే, సుబ్బులు ద్వారా కబురు పెట్టు" అంటూ వెళ్ళిపోయాడు. అన్నపూర్ణమ్మ ఆలోచిస్తూ ఇంట్లోకి నడిచింది.

** ** **

మారుతీరావు ఇంటి పేరు 'మారు పేర్లు' కాదు! మారు పేర్ల మారుతీరావు అన్నది ఆ కాలనీ వాళ్ళు కసితో ఆయనకి పెట్టిన మారు పేరు! కాలనీ వాళ్ళకి ఆయన మీ దెందుకు కసి అంటే, మారుతీరావుకి కనిపించిన ప్రతివాళ్ళకీ ఏదో ఒక మారు పేరు పెట్టడం హాబీ! ఆయన పెట్టిన మారుపేర్లు ఎంత ప్రఖ్యాతి గాంచాయంటే, ఆ కాలనీలోని కొంతమంది తమ అసలు పేర్లు మరిచిపోయి, మారుతీరావు పెట్టిన మారు పేర్లతోనే చలామణీ అయిపోతున్నారు. 'గునపాచారి' (అస్తమానం గునపం పట్టుకుని చెట్లకి గొప్పులు తవ్వుతూ ఉండే పొరుగింటాయన), 'అడ్డ కాళ్ళ అంబుజాక్షి' (ఆవిడ అసలు పేరు సీతామాలక్ష్మి! కాని మా మా గారి ధర్మమా అని ఆఖరికి ఆవిడ భర్తకూడా 'అంబుజం' అని పిలిచే స్థితికి వచ్చేశాడు), 'జడ్జి జలజ' (ఆవిడ తెలివి తేటలకి మెచ్చుకుని మా మా తగిలించిన పేరు), 'దివ్య దర్శనం' (ఈ పేరు గురించి వివరించడం అంత బాగుండదు), 'ఓం నమశ్శివాయగారు' మొదలైనవి మారుతీరావు పెట్టిన మారు పేర్లలో మచ్చుకి కొన్ని!

ఒకసారి పాపం 'గునపాచారి' అనబడే ప్రసాదరావుగారు ఏదో పనిబడి మారుతీరావు దగ్గరికి రావడం జరిగింది. మారుతీరావు-

"ఇదిగో, అన్నపూర్ణా! ఆచారిగారు వచ్చారు గానీ, కాస్త కాఫీ పంపించు" అంటూ ఇంట్లోకి కేక వెయ్యడంతో ప్రసాదరావు తెల్లబోయి-

"మేం ఆచార్లం కాదండీ! శైవులం!" అన్నాడు. మారుతీరావు-

"ఆఁ! పేరులో ఏముంది లెద్దురూ?"అంటూ తేల్చేశాడు. అలాగే సీతామాలక్ష్మి కాఫీపొడి అప్పు కోసం వచ్చినప్పుడు-

"అన్నపూర్ణా! అంబుజాక్షిగారు వచ్చారు- చూడూ!" అనడం, సీతామాలక్ష్మి నోట మాట రాక తడబడుతూ-

"నా పేరు అంబుజాక్షి కాదు, అన్నగారూ!" అనడం, మారుతీరావు-

"ఏమిటో నాకు మీ ఆడాళ్ళ పేర్లు జ్ఞాపకం ఉండవు, చెల్లెమ్మా!" అంటూ తప్పించుకోవడం చూసి తరవాత అన్నపూర్ణమ్మ భర్తని సన్న సన్నగా చీవాట్లు పెట్టడం జరిగాయి. మరోసారి 'జడ్జి జలజ'ని పల్లిగ్గా-

"జడ్జి జలజగారు వచ్చారు. రండి! రండి!" అంటూ ఉంటే ఆవిడ ఉరిమి చూసి-

"ఏమిటో అంటున్నారు?" అంటూ అడగడంతో మారుతీరావు తడబడి-

"అబ్బే! మీ ఇంటి పేరు 'జడ్' గదూ? అదే ఇనిషియల్ 'జడ్' అనుకుని జడ్ జలజగారు వచ్చారూ అన్నాను" అంటూ తప్పించుకున్నాడు. ఇంకోసారి ఓ అమాయకుడు వచ్చి మారుతీరావుతో

"మా అమ్మాయికి 'మాధవిలత' అని పేరు పెట్టాలని మాఆవిడ పట్టు పట్టుక్కూర్చుంది. నాకేమో మాఅమ్మ పేరో, లేకపోతే మాఅత్తగారి పేరో పెట్టుకోవాలని ఉంది" అంటూ మొర పెట్టుకున్నడు. మారుతీరావు రెండు క్షణాలు ఆలోచించి-

"మీ అమ్మ పేరు ఏమిటన్నావు?" అని అడిగాడు.

"సుబ్బమ్మ."

"మీ అత్తగారి పేరు?"

"లింగమ్మ."

"అయితే ఇంకేం! సుబ్బరంగా 'సుబ్బలత' అని పెట్టు. లేకపోతే 'లింగలత' అన్నా ఫరవాలేదు. అదీగాకపోతే 'సుబ్బలింగ మాధవీ' అంటే మరీ బెస్టు అనుకో! అటు నీ కోరికా తీరుతుంది, ఇటు మీ ఆవిడ ముచ్చటా తీరుతుంది" అనగానే ఆ అమాయకుడు తెల్లబోయి ఓ నమస్కారం పెట్టి చక్కా పోయాడు. అన్నపూర్ణమ్మ, "వయస్సు మీద పడుతోంది. చెట్టంత కొడుకు ఉన్నాడు. ఏమి టీ కొక్కిరాయి కబుర్లు?" అంటూ ఎంత మొత్తుకున్నా మారుతీరావు మారలేదు. మారుతీరావుకి కాలు మీద కాలేసుకుని తిన్నా తరగనంత ఆస్తితో పాటు, మంచి ఉద్యోగంలో ఉన్న కొడుకు ఉన్నాడు. అతనే 'సుబ్బులు' అనబడే సుబ్బారావు. సుబ్బారావుకి తండ్రి లక్షణాలేమీ అబ్బలేదు. తల్లిలా గంభీరంగానే ఉంటాడు. అన్నపూర్ణమ్మకి తన అన్న కూతురు శ్యామలని సుబ్బారావుకి చేసుకోవాలని ఆశ! మారుతీరావు ఏమీ అడ్డు పెట్టలేదు గాని, రామశర్మ ఓ ఆదివారం వచ్చి-

"ఈ శుక్రవారం బాగుందట! ఏదో లాంఛనంగా తాంబూలాలు పుచ్చేసుకుందాం, చెల్లెమ్మా..." అంటూ పెత్తనం అంతా తన చెల్లెలిదే అన్నట్టు మాట్లాడడం, ఇంటి యజమాని, కాబోయే వియ్యంకుడు అయిన తన కేమీ ప్రత్యేకతని ఇవ్వక పోవడం చూసి ఒళ్ళు మండగా-

"ఆగాగు! అంత తేలికగా కూతురి పెళ్ళి చేసేద్దా మనుకొంటున్నా వేమో!" అంటూ అడ్డు పడ్డాడు. రామశర్మ తెల్లబోయి-

"అదేమిటి, బావా? వాళ్ళు చిన్న పిల్లలప్పటి నించీ అనుకుంటున్నదే కదా? చెల్లెలి కొడుకు అని ముద్దు ముచ్చటలలో లోటు చేస్తా ననుకుంటున్నావేమో! నీ హోదాకి, నీ కొడుకు హోదాకి తగినట్టే అన్నీ జరిపిస్తాను" అన్నాడు. మారుతీరావు-

"అసలు నువ్వు ఆడపిల్లల తండ్రి పడవలసినన్ని పాట్లు పడలేదు. అంటే, పెళ్ళికొడుకుల కోసం చెప్పులు అరిగిపోయేటట్టు తిరగడం గట్రా చెయ్యలేదు. పైగా నీ ఇంటి చుట్టూ తిరిగి, నా కొడుకు తన చెప్పులు అరగ దీసుకుంటున్నాడు. అది వేరే సంగతి! ఈ లోకంలో ఇంతమంది ఆడపిల్లల తండ్రులు ఇన్ని బాధలు పడుతూ ఉంటే, నీకు మాత్రం స్పెషాలిటీ ఏమిటి?" అన్నాడు. రామశర్మకి బావగారి ధోరణి అంతు పట్టక చిరాగ్గా-

"అయితే, ఏం చెయ్యమంటావు? నీ ఇంటి చుట్టూ ప్రదక్షిణలు చెయయమంటావా?" అని అడిగాడు. అన్నపూర్ణమ్మ-

"ఉరుము ఉరిమి మంగలంమీద పడ్డట్టు, ఊళ్ళో వాళ్ళెవళ్ళో బాధలు పడుతూ ఉంటే మధ్యన మా అన్నయ్యని నిలదియ్యడం బాగుంది!" అంటూ మూతి మూడు వంకరలు తిప్పింది. మారుతీరావు-

"నువ్వు నోరు మూసుకో! ఇది చాలా సీరియస్ విషయం. ఆడపిల్లని కన్న తండ్రి ఈ దేశంలో ఇంత సుఖంగా ఉండకూడదు. అందుకే మీ అన్నయ్యకి నే నో చిన్న పరీక్ష పెట్టదల్చుకున్నాను" అన్నాడు. రామశర్మ గుండె గుభేలుమంది. మారుతీరావుని రామశర్మ చిన్నతనంనించీ ఎరుగును. మారుతీరావు పరీక్ష లంటూ అస్తమానం తలా తోకా లేని ప్రశ్నలు వెయ్యడం, రామశర్మ ఓడిపోయి మారుతీరావు చేత మొట్టికాయలు తినడం రామశర్మకి బాగా జ్ఞాపకం ఉంది. ఇప్పుడు పరీక్ష అంటూ పెట్టి తన బట్టతలమీద మొట్టడు గదా? అనుకుంటూ-

"వేళాకోళాలకి సమయం, సందర్భం ఉండాలి, బావా! ఇప్పుడు నేను వచ్చింది నా కూతురి పెళ్ళి విషయం మాట్లాడటానికి! నీకు అంత ముచ్చటగా ఉంటే పెళ్ళయిపోయాక ఇద్దరం కూర్చుని కావలసినన్ని పరీక్షలు పెట్టుకుదాం" అన్నాడు. మారుతీరావు-

"అహ్హహ్హ"అంటూ విలన్‌లా నవ్వి-

"పెళ్ళి! నువ్వీ పరీక్షలో ఓడిపోతే ఈ పెళ్ళి జరగదు. అది నా షరతు" అన్నాడు. రామశర్మ తెల్లబోతూ-

"బావా, నీకు మతిగాని పోలేదుగదా?" అన్నాడు.

"మతి పోలేదు గనకే నీ కీ పరీక్ష." అన్నపూర్ణమ్మ-

"చాల్లెండి పిచ్చి వేషాలు! పరీక్షట పరీక్ష! మతి లేకపోతే సరి" అంది. మారుతీరావు-

"ఊఁ! భర్తద్రోహీ! నోరు మూసుకో! ఇది నీ అన్నకే కాదు, నీకూ, నీ కొడుకుకీ కూడా పరీక్ష! నేను అడిగే ప్రశ్నకి మీ ముగ్గురిలో ఎవరు జవాబు చెప్పినా సరే, ఈ పెళ్ళి జరుగుతుంది. లేదూ నా కంఠంలో ప్రాణం ఉండగా ఆ సుబ్బిగాడు ఈ రామశర్మ అల్లుడు అవడు. అర్థం అయిందా?" అంటూ గర్జించాడు. అన్నపూర్ణమ్మకి భర్త సీరియస్‌గానే మాట్లాడుతున్నాడని అర్థం అయింది.

"మీకేం పిచ్చి పట్టలేదు గదా? కావాలంటే కట్నమో, కానుకో అడిగి పుచ్చుకుంటారు గానీ, ఇదేమిటి? పరీక్షట పరీక్ష!" అంటూ అరిచింది.

"అనవసరంగా ఆవేశపడకు! బుర్ర ఉపయోగించి నీ అన్నకు సాయపడు. బావా, ప్రశ్న అడుగుతున్నాను! కాచుకో! 'పా పి త' అంటే ఏమిటి?" అన్నాడు. అన్నపూర్ణమ్మ నోరు టక్కున మూసుకుపోయింది. రామశర్మ బావగారిని అనుమానంగా చూస్తూ-

"ఏమిటన్నావు?" అని అడిగాడు. మారుతీరావు మళ్ళీ-

"పా పి త అంటే ఏమిటి?" అంటూ ఒకొక్క అక్షరం ఒత్తి పలికేడు. రామశర్మ బట్టతల గోక్కుంటూ-

"ఇది అసలు తెలుగు పదమేనా?" అని అడిగాడు.

"అది కనుక్కోవలసిన బాధ్యత నీది! మూడు రోజులలోగా ఈ ప్రశ్నకి సమాధానం చెప్పలేకపోతే మన సంబంధం సంగతి మరిచిపో." అంతా వింటూ అక్కడే కూర్చుని ఉన్న సుబ్బారావు రంగంలోకి దూకాడు.

"నాన్నా, ఇది అన్యాయం! నేను శ్యామలని తప్ప మరెవర్నీ చేసుకో దలచుకోలేదు" అన్నాడు.

"శ్యామలని చేసుకోవాలంటే మీ మామయ్యకి సమాధానం కనుక్కోవడంలో సహాయం చెయ్యి. అంతేగాని, నన్ను లొంగదీసుకోవాలని ప్రయత్నించకు. నేను చాలా చెడ్డవాడిని." అంతదాకా మౌనంగా ఆలోచిస్తూ కూర్చున్న అన్నపూర్ణమ్మ-

"అన్నయ్యా! ఇది ఏ తలకు మాసిన వాళ్ళకో ఈయన పెట్టిన మారుపేరై ఉంటుంది" అంటూ గావుకేక పెట్టింది. రామశర్మ ఆనందంగా-

"అవునవును! అదే! అదే అయి ఉంటుంది. బావా, తెలిసిపోయిందిగా- మరి పెళ్ళికి ఒప్పుకుంటావా?" అన్నాడు. మారుతీరావు మళ్ళీ విలన్ లాగా నవ్వి-

"ఇలాంటి ఊహాగానాలు వద్దు! నాకు పూర్తి వివరాలు కావాలి! 'పా పి త' ఆలోచించండి" అంటూ తను అక్కడ ఉండటం ప్రమాదం అని గ్రహించి తన గదిలోకి వెళ్ళిపోయాడు. అన్నపూర్ణమ్మ ఆత్రంగా-

"ఒరేయ్, సుబ్బులూ, ఇది తప్పకుండా మీ నాన్న ఎవరికో పెట్టిన మారుపేరే! సందేహం లేదు. కాని, 'పా పి త' అంటే ఏమిటి చెప్మా? పా పి త...పా పి త...పా పి త...ఛా! ఏమీ అర్థం కావటం లేదు" అంది. రామశర్మకూడా 'పా పి త' జపం చేస్తూనే ఉన్నాడు. సాయంత్రం దాకా బుర్రలు బద్దలు కొట్టుకున్నా ముగ్గురికీ 'పా పి త' అంటే ఏమిటో తెలీలేదు. రామశర్మ గుండె జారిపోయినట్టయిపోయింది. సుబ్బులు దిగాలుపడిపోయాడు. అన్నపూర్ణమ్మ మరి లాభం లేదని, భర్తని బుట్టలో వేసుకునే విషయం గురించి ఆలోచించసాగింది.

** ** **

వెడల్పాటి జరీ అంచు తెల్లచీర నెరిసిన జుట్టుతో, సిగలోని మల్లెలతో పోటీపడుతూ ఉండగా గదిలోకి అడుగు పెట్టిన అన్నపూర్ణమ్మని చూసి మారుతీరావు కెవ్వున కేకవెయ్యబోయి, పక్క గదిలో ఉన్న కొడుక్కి, వినపడుతుందని జ్ఞాపకం వచ్చి నోరు నొక్కుకుని-

"ఇలాంటి పిచ్చి పిచ్చి వేషాలు వేశావంటే నిన్ను మీ పుట్టింటికి పంపించేస్తాను- జాగ్రత్త!" అంటూ బెదరించాడు. ఎందుకైనా మంచిదని సెలో టేపు వెతికి నోటికి అంటించేసుకున్నాడు. అన్నపూర్ణమ్మ ఎత్తులేవీ పారలేదు. రాత్రంతా ఆవిడ 'పా పి త' అంటూ కలవరిస్తూనే ఉంది. సుబ్బారావుకి గోడల నిండా, నేలనిండా 'పా పి త' అని రాసి ఉన్నట్టు, 'పా పి త'ని తప్పించుకోడానికి తను పరుగెడుతూ ఉంటే, 'పా పి త' అన్న అక్షరాలు తనని తరుముకు వస్తున్నట్టు కలలు



daCunha/AS/27/84/TL

వచ్చాయి. రామశర్మకైతే మతి మతిలో లేదు. ఇంటికి వెళ్ళి భార్యని 'శాంతా!' అని కేక వెయ్యబోయి, 'పా పి తా' అని కేకవేసి చీవాట్లు తిన్నాడు. భోజనం చేస్తూ, 'కొంచెం కూర వెయ్యి' అనడానికి బదులు, 'కొంచెం పా పి త వెయ్యి' అనడం, ఆయన అర్ధాంగి 'ఎవరీ పా పి త? ఈ వయసులో మీ కీ బుద్ధులేమి'టని నిలదియ్యడం జరిగింది. రామశర్మ బావగారు తనకి పెట్టిన పరీక్ష గురించి ఇంట్లో చెప్పదలచుకోలేదుగాని, భార్య శాంతమ్మ అపార్థం చేసుకోవడంతో జరిగిన సంగతి చెప్పక తప్పలేదు. అంతా విని శాంతమ్మ, "హమ్మ! పా పి తా! కొంప ముంచావుగదా!" అంటూ ముక్కుమీద వేలు వేసుకుంది. మర్నాడు రామశర్మ చెల్లెలి ప్రయత్నాలు ఏమైనా ఫలించాయేమో అనే ఆశతో మారుతీరావు ఇంటికి వెళ్ళేసరికి అన్నపూర్ణమ్మ పూజ చేసుకుంటోంది. ఆవిడ అష్టోత్తరంలో చాలాసార్లు 'పాపితాయైనమః' అన్న పదాలు వినబడి రామశర్మ నెత్తిన చేతులు పెట్టుకుని కూర్చుండిపోయాడు. సుబ్బారావు ఈ సంగతి తేలేదాకా ఆఫీసుకు వెళ్ళదలచుకోలేదు. రెండు రోజులు గడిచినా ఎవరికీ ఏమీ తట్టలేదు. మారుతీరావు నోటికి సెలోటేపుతోనే తిరుగుతున్నాడు. అప్పుడప్పుడు భార్య, బావమరదుల అవస్థ చూసి విలన్ నవ్వులు నవ్వడానికి మాత్రం టేపు తీస్తున్నాడు. మూడో రోజు రామశర్మ-

"లాభంలేదమ్మా! నేను బావ కాళ్ళు పట్టేసుకుంటాను. కావాలంటే ఓ షీల్డు మీద 'పా పి త' అని చెక్కించి, అందర్లో సన్మానం చేసి తనే గెలిచాడని ఒప్పుకుంటాను. ఓడిపోయినందుకు నా కూతురి జీవితం నాశనం చెయ్యద్దని బ్రతిమాలుకుంటాను" అన్నాడు కళ్ళు ఒత్తుకుంటూ. అన్నపూర్ణమ్మకి అన్నగారి పరిస్థితి చూసేసరికి కడుపు తరుక్కుపోయింది. ఇంక ఆ పూటతో గడువు తీరిపోతుందనగా, సుబ్బారావు దేవదాసులాగా గెడ్డం (కొద్దిగా) పెంచేసుకుని, ఇంట్లో ఉండి తల్లి, మేనమామల పరిస్థితి చూడలేక వెళ్ళి పిట్టగోడ మీద కూర్చుని వీధిలో వచ్చేపోయే వాళ్ళని దిగాలుగా చూడసాగేడు. ఎంతోమంది ఏవో పనుల మీద హడావిడిగా పోతున్నారు. నిర్లిప్తంగా ఉన్న అతని కళ్ళు హఠాత్తుగా దారిన పోతున్న ఓ మనిషి మీద పడ్డాయి. అతని తలలో మెరుపు మెరిసినట్టయింది. గోడమీదనించి ఒక్క దూకు దూకి-

"అమ్మా! మామయ్యా! తెలిసిపోయింది. 'పా పి త' అంటే తెలిసిపోయింది" అని అరుస్తూ ఇంట్లోకి వచ్చిపడ్డాడు. రామశర్మ బావగారి కాళ్ళు రెండూ పట్టుకోడానికి వంగబోయి, మేనల్లుడి కేకలు విని నిటారుగా నిలబడిపోయాడు. సుబ్బారావు పిచ్చి ఆనందంతో, "అహ్హహ్హహ! పా పి త" అంటూ గెంతులు వేస్తున్నాడు. మారుతీరావు మొహం వెల్లవేసినట్టు తెల్లబడిపోయింది. "తెలిస్తే సమాధానం చెప్పి ఏడువ్! ఆ గంతులు ఏమిటి?" అంటూ గద్దించబోయేడు. కాని, సెలోటేపు నోటికి ఉండటం వల్ల మాట బయటికి రాలేదు. సుబ్బారావు తండ్రి అవస్థ గమనించకుండా-

"పా పి త అంటే- 'పొట్టి పిల్లల తల్లి' అని అర్థం! అవునా? ఆ పక్క సందులోకి కొత్తగా వచ్చారే- మరాఠీ వాళ్ళు ఆవిడకి నాన్న పెట్టిన (మనసులో అనుకున్న) పేరు పా పి త! ఎందుకంటే, ఆవిడ, ఆవిడ భర్త పొడుగ్గా ఉన్నా వాళ్ళ కూతుళ్ళు పొట్టిగా ఉంటారు. ఆ రోజు మామయ్య వచ్చే ముందే ఆవిడ వచ్చి అమ్మతో మహిళా సంఘం గురించి ఏదో మాట్లాడింది. నాన్నకి ఆవిడని చూడగానే ఆవిడ పొట్టిపిల్లలు గుర్తుకి వచ్చి ఉంటారు. ఆవిడకి మనసులో 'పొట్టి పిల్లల తల్లి' అంటే 'పా పి త' అని నిక్ నేమ్ పెట్టేసి ఉంటాడు. కాకపోతే సరిగ్గా అదే టైముకి మామయ్య రావడంతో నాన్నకి మామయ్యని ఏడిపించాలని బుద్ధిపుట్టి 'పా పి త' అంటే ఏమిటంటూ ప్రశ్న వేశాడు" అన్నాడు. తన మనసుని పుస్తకం చదివినట్టు చదివేసిన కొడుకుని ఆశ్చర్యంగా చూస్తూ మారుతీరావు మూతికి ఉన్న సెలోటేపు ఊడలాగేశాడు. రామశర్మ అదే అదనుగా చెల్లెలు అందించిన తాంబూలం-

"బావా! తాంబూలాలు!" అంటూ చేతిలో పెట్టాడు. మారుతీరావు తేరుకుని-

"బావా, మరో చిన్న ప్రశ్న..." అనగానే రామశర్మ ఢామ్మని కింద పడిపోయాడు. *

